సాక్షి వికారాబాద్

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



ఎనిమిదేళ్లుగా నిర్లక్ష్యం

ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం జనరేటర్లు పంపిణీ చేసింది. ఏళ్లు గడుస్తున్నా వాటిని వినియోగంలోకి తేవడం లేదు. 8లో▸



రుణమాఫీ డబ్బులివ్వండి

రైతు రుణమాఫీ డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయకపోతే ఊరుకునేది లేదని ప్రజా సంఘాల నేతలు హెచ్చరించారు. 8లో▸



పంటల లెక్క.. ఇక పక్కా

పంటల నమోదు, ఎరువులు, విత్తనాలు, అందుబాటులో ఉంచడానికి ప్రభుత్వం ఈ క్రాప్ బుకింగ్ చేపట్టింది. 9లో▸

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

జై భారత్ జిల్లా ప్రధానకార్యదర్శి సంపత్‌కుమార్



మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న సంపత్ తదితరులు

బంట్వారం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని జై భారత్ జిల్లా ప్రధానకార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన నూతనంగా బాధ్యతలు చేపట్టిన మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్యూలాను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం సంపత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఖాజాపాష, నరేశ్, బాల్‌రాజ్, నారాయణ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ గణనాథుడికి బందో'మస్తు'



పోలీస్ బందోబస్తు నడుమ బాలాపూర్ గణనాథుడి శోభాయాత్ర

పహాడీషరీఫ్: బాలాపూర్ గణనాథుడి లడ్డూ వేలం పాట, నిమజ్జన శోభాయాత్రను జయప్రదం చేయడంలో రాచకొండ పోలీసులు సఫలీకృతులయ్యారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు పర్యవేక్షణలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అదనపు ఎస్పీలు, ఏసీపీతో కలిసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. లడ్డూ వేలం ముగిసిన వెంటనే గణనాథుడిని క్రేన్‌తో టస్కర్ వాహనంపై ఎక్కించడం.. ఆపై పాతబస్తీ ప్రభావం కలిగిన రాయల్ కాలనీ.. గుర్రం చెరువుకట్ట మీదుగా వెళ్లి హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పోలీసుల పర్యవేక్షణలోకి వచ్చేంత వరకు పకడ్బందీగా వ్యవహరించారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ సీఐ భూపతి దగ్గరుండి పర్యవేక్షించారు.

మొక్కలతోనే మానవ మనుగడ

ఎమ్మెల్సీ వాణిదేవి



రిసార్ట్స్ కేంద్రంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ వాణిదేవి

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్సీ వాణిదేవి అన్నారు. మంగళవారం సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల స్వామి రామానందతీర్థ రిసార్ట్స్ సెంటర్ పీవీ మెడికల్ వనంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని డైరెక్టర్ శేఖర్ పెద్దఎత్తున నిర్వహించారు. అనంతరం పీవీ మెడిసినల్ రిసార్ట్స్ సెంటర్‌లో ఉన్న మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ వాణిదేవి పాల్గొని అందరితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో నేటి భావితరాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి సంవత్సరం పీవీ మెడిసినల్ వనంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడాన్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో పీవీ మెడిసినల్ రిసార్ట్స్ సెంటర్ డైరెక్టర్ శేఖర్, ఎత్తుమార్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ భిక్షపతి, ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

హ్యాండ్ రిటన్ బైబిల్‌కు అరుదైన గౌరవం

షాద్‌నగర్ రూరల్: హ్యాండ్ రిటన్ బైబిల్‌కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. ఏపీలోని కర్నూల్ పట్టణ శివారులోని పుల్లారెడ్డి కాలేజ్(రెమ చర్చి)లో బైబిల్ రీడింగ్ చాలెంజ్ గ్రూపు ఆధ్వర్యంలో మంగళవారం బైబిల్‌ను చేతితో రాశారు. ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి 160 మంది మహిళలు పాల్గొనగా.. పట్టణంలోని జియోన్ ఎంబీ చర్చికి చెందిన ప్రతినిధులు సమంత, జెరుషా ప్రెట్టి, సుచిత్ర, ప్రియాంక పాల్గొన్నారు. 160 మంది మహిళలు కేవలం 8గంటలలోనే చేతి రాతతో బైబిల్‌ను రాసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు. ఇది ప్రపంచంలోనే మొదటి సారిగా నమోదైన రికార్డు అని నిర్వాహకులు తెలిపారు.



జ్ఞాపికలు అందుకుంటున్న చిన్నారులు

నియంతృత్వం అంతం

తెలంగాణకు స్వాతంత్య్రం

- సెప్టెంబర్ 17 తెలంగాణకు ప్రత్యేకం
- ప్రజాపాలన దినోత్సవంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్: ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా అరాచక రాచరిక వ్యవస్థకు చరమగీతం పాడిన నేటి రోజును స్మరించుకోవడం ఎంతో అవసరమని శాసన సభా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యాదయ్య, మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. మెప్మా ఆధ్వర్యంలో రూ.15 కోట్లు, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో రూ.26 కోట్ల బ్యాంకు లింకేజీ, శ్రీనిధి చెక్కులు మహిళా సంఘాలకు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం సిద్ధిస్తే తెలంగాణకు మాత్ర 1948 సెప్టెంబర్ 17న స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నాయన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఎందరో మహనీయులు అసువులు బాసారని వివరించారు. ఈ ప్రాంత స్వతంత్ర్య కాంక్షను గుర్తించిన నాటి ప్రధాని నెహ్రూ, హోంశాఖ మంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ చొరవతో సైనిక చర్య ద్వారా హైదరాబాద్ నిజాం సంస్థానం తెలంగాణలో విలీనమైందని గుర్తు చేశారు. జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఒక్కొక్కటిగా హామీల అమలు

రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో ముందుందన్నారు. అభయ హస్తంలో భాగంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యలపై 2.84లక్షల దరఖాస్తులు స్వీకరించామన్నారు. గ్యాస్, రేషన్ కార్డులు, గృహజ్యోతి సవరణల కోసం ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి తప్పులు సరిచేస్తున్నామన్నారు. 1.79కోట్ల మంది మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీలో ప్రయాణం చేశారని చెప్పారు. ఇందుకు జిల్లా నుంచి రూ.65 కోట్లు ప్రభుత్వం భరించిందన్నారు. రూ.500 గ్యాస్ సిలిండర్ ఇచ్చేందుకు జిల్లాలో లబిదారులకు రూ.1.73కోట్లు రాయితీ అందజేసిందన్నారు. జిల్లాలో గృహజ్యోతి పథకం కింద 1.26లక్షల వినియోగదారులకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఇందుకు రూ.12.53 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు.



జెండా ఎగురవేస్తున్న ప్రసాద్‌కుమార్

సంక్షేమంలో కాంగ్రెస్ టాప్

రూ.2లక్షల రుణమాఫీలో భాగంగా జిల్లాలో లక్షా తొమ్మిదివేల మంది రైతులకు గాను ప్రభుత్వం రూ.905 కోట్లు బ్యాంకులకు చెల్లించిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్ట పరిచి రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 3,200 మంది ఉచిత వైద్య సేవలందించామన్నారు. ఇందుకు రూ.4.60 కోట్లు వెచ్చించామన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలోని 1,062 పాఠశాలలకు గాను 924 పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభించి 792 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారని చెప్పారు. ఇందుకు రూ.17.23 కోట్లు చెల్లించామని తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో గురుకుల పాఠశాలల కోసం 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో 377 ఇళ్లు కూలిపోగా ఒక్కో ఇంటికి రూ.16,500 చొప్పున ప్రభుత్వం పరిహారం అందించిందన్నారు. అనంతరం సంఘం లక్ష్మీబాయి పాఠశాల, వికారాబాద్ కేజీబీవీ విద్యార్థులు, బండవెల్కిచర్ల ఆశ్రమపాఠశాల విద్యార్థులు, కొత్తగడి సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైయినీ కలెక్టర్ ఉమాహారతి, ఆయా శాఖల జిల్లా అధికారులు, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఘనంగా అనంత వ్రతాలు

పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

అనంతగిరి: అనంత చతుర్థశి సందర్భంగా మంగళవారం వికారాబాద్‌పట్టణ సమీపంలోని అనంతగిరి గుట్ట శ్రీఅనంతపద్మనాభ స్వామి ఆలయంలో భక్తులు అనంత వ్రతాలు ఆచరించారు. ఈ వ్రతాలకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ వ్రతాలు ప్రారంభించిన వారు 14 ఏళ్లపాటు చేయాల్సి ఉంటుందని అర్చకులు వివరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలనుంచి, కర్ణాటక రాష్ట్రం నుంచి వ్రతం ఆచరించే భక్తులు ఉదయం 9గంటలకే ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. మొత్తం వంద మంది దంపతులు ఈ పూజలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణం అనంతరం అర్చకులు అనంత కథ వినిపించారు. ప్రత్యేక హారతి అనంతరం తీర్థ ప్రసాదలు ఇచ్చారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ పద్మనాభం, ఈఓ నరేందర్ భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



అనంత పద్మనాభ స్వామి వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

కుక్కల జనన నియంత్రణకు చర్యలు

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జిల్లా వ్యాప్తంగా కుక్కల జనన నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆయన పశుసంవర్ధక శాఖ అధికారులతో జూమ్ మీటింగ్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. కుక్కల బెడదతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని.. వాటి సంతానోత్పత్తిని తగ్గించేందుకు జంతు జనన నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆపరేషన్ నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టాలన్నారు. ఆపరేషన్లకు సంబంధించి టేబుల్స్, లైట్లు సమకూర్చుకోవడంతోపాటు ఆపరేషన్ థియేటర్లో ఏసీ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెద్ద మొత్తంలో కుక్కలను పట్టుకుని జంతు జనన నియంత్రణ కేంద్రాలకు తరలించాలన్నారు. రెండు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి సెప్టెంబర్ 20 నుంచి ఆపరేషన్లు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు ఇందుకు కావాల్సిన పరికరాలను, ఇంజక్షన్లు, మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, ట్రైయినీ కలెక్టర్ ఉమా హారతి, డీవీహెచ్‌ఓ సదానందం, తాండూరు అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజలకు మెరుగైన పాలన అందించండి

సబ్ కలెక్టర్‌తో ఎమ్మెల్యే భేటీ

తాండూరు టౌన్: తాండూరు రెవెన్యూ డివిజన్‌లో ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌ను కోరారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉమాశంకర్ ప్రసాద్‌తో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీఎంఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తాండూరును సబ్ కలెక్టర్ హోదాకు పెంచిందన్నారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందజేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఘనంగా నిమజ్జనం

- గంగమ్మ ఒడి చేరిన గౌరీ సుతుడు
- అడుగడుగునా భక్తుల నీరాజనం
- బ్యాండు చప్పుళ్లు.. యువత స్టెప్పులు
- ఇంద్రానగర్ గణపతి లడ్డూ రికార్డు స్థాయిలో రూ.4.51లక్షలు

అనంతగిరి: వినాయక నవరాత్రుల సందర్భంగా పూజలందున్న గణనాథుడికి జిల్లా వాసులు ఘనంగా వీడ్కోలు పలికారు. జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై.. గణపతిబప్పా మోరియా అంటూ దారి పొడవునా నినాదాలు చేస్తూ శోభాయాత్ర చేపట్టారు. మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానాలు చేపట్టారు. అనంతరం లడ్డూ వేలం నిర్వహించి గణనాథులను కదిలించారు. 80కిపైగా గణపతి విగ్రహాలు నిమజ్జనానికి తరలాయి. యువకుల నృత్యాలు, మహిళల కోలాటాలు, కళాకారుల ఆటపాటలతో శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. వికారాబాద్ పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో, హిందూ ఉత్సవ సమితి, ఆయా సంఘాల ప్రతినిధులు స్వాగత వేదికలు ఏర్పాటు చేశారు. వికారాబాద్‌లోని ఇంద్రానగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను రూ.4.51లక్షలకు రాజుగౌడ్ కైవసం చేసుకున్నాడు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి: స్పీకర్

మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రసంగించారు. గణనాథుడు చల్లగా చూడాలని వేడుకున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మాధవరెడ్డి, గౌరవ అధ్యక్షుడు చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, పలువురు కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎబ్బనూర్ చెరువులో నిమజ్జనం...

పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగిన శోభాయాత్ర అనంతరం గణనాథులను ఎబ్బనూర్ చెరువులో క్రేన్‌ల సాయంతో నిమజ్జనం చేశారు. అర్ధరాత్రి దాటే వరకు నిమజ్జనం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలను 30కిపైగా స్థానిక చెరువుల్లో నిమజ్జనం గావించారు.



ఇంద్రానగర్ గణనాథుడి శోభాయాత్ర



స్వాగత వేదిక వద్ద మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, చిత్రంలో ఎస్పీ నారాయణరెడ్డి తదితరులు



ఇంద్రానగర్‌లో లడ్డూ దక్కించుకున్న రాజుగౌడ్



రామయ్యగూడ వినాయకుడి వద్ద చిన్నారుల ప్రదర్శన

క్లుప్తంగా

బీఆర్ఎస్ హయాంలోనే సుపరిపాలన

జాతీయ సమైక్యతా దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



వేడుకల్లో పాల్గొన్న మహేశ్‌రెడ్డి, ముకుంద అశోక్ తదితరులు

పరిగి: జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని మంగళవారం పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందిందన్నారు. కేసీఆర్ పేదల పక్షపాతి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, మాజీ ఎంపీపీ అరవిందరావు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, రవీందర్, రవికుమార్, కృష్ణ, తాహేర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

బొంరాస్‌పేట: బైక్ అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రం శివారులోని బొంరాస్‌పేట-బురాన్‌పూర్ మార్గంలో చోటు చేసుకుంది. ఎండీ.రవూఫ్ తెలిపిన ప్రకారం.. పరిగి మండలం ఇబ్రహీంపూర్ తండాకు చెందిన మధు(20) పల్సర్ బైక్ వెళ్తుండగా బురాన్‌పూర్ మలుపు వద్ద అదుతప్పి కింద పడ్డాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి హన్మానాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తక్షణ న్యాయం కావాలి

ఎమ్మెల్యే ఎదుట ఆత్మహత్యాయత్నం

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన రైతు దప్పు రాజు మంగళవారం మరోసారి పురుగుల మందు డబ్బా చేతిలో పట్టుకొని ఆత్మహత్యా యత్నం చేశాడు. మొదట తాండూరులోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్దకు వెళ్లాడు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కొద్ది క్షణాల క్రితమే కరన్‌కోట్ వెళ్లారని తెలియడంతో బైక్‌పై బయల్దేరాడు. కాన్వాయ్ కనిపించగానే వాహనాలను అనుసరించాడు. ఈక్రమంలో కరన్‌కోట్ శివారులోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్లే దారి వద్ద మందు డబ్బాతో బైక్‌పై వస్తున్న రాజును చూసిన ఎమ్మెల్యే కారు ఆపారు. దీంతో తనకు తక్షణ న్యాయం చేయాలని, లేదంటే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానన్నాడు. అప్రమత్తమైన ఎస్ఐ విఠల్‌రెడ్డి కాన్వాయ్ వాహనంలో నుంచి కిందకు దిగి రాజు చేతిలోని పురుగు మందు డబ్బాను లాక్కుని పడేశారు. దీంతో అక్కడ ఒక్కసారిగా టెన్షన్ వాతావరణం నెలకొంది. న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా ఇలా వ్యవహరించడం సరికాదని ఎమ్మెల్యే వారించారు. తహసీల్దార్‌తో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని చెప్పారు. ఇదిలా ఉండగా అంతారం గ్రామంలో రాజు కుటుంబ సభ్యులు సాగుచేసుకుంటున్న తొమ్మిది ఎకరాల భూమిలో.. మార్కెట్ కమిటీ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ఐదున్నర ఎకారాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఇదే విషయమై తనకు న్యాయం చేయాలని రాజు కోరుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మెన్ మృతి

మొయినాబాద్: అతివేగంతో వచ్చిన బైక్ మోపెడ్‌ను ఢీకొట్టడంతో ఓ వాచ్‌మెన్ మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా కుర్కుంటకు చెందిన దస్తగిరి (50) మండల పరిధిలోని ముర్తూజాగూడ సమీపంలో ఉన్న ఓ ఫాంహౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం దస్తగిరి, అతని స్నేహితుడు జఫ్పర్ కలిసి మోపెడ్‌పై ముర్తూజగూడ గ్రామానికి వెళ్లారు. తిరిగి ఫాంహౌస్‌కు వస్తుండగా ఓ బైక్ అతివేగంతో వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనంపై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఉస్మానియా ఆస్పత్రికి పంపించారు. ఉస్మానియాలో చికిత్స పొందుతూ దస్తగిరి సోమవారం రాత్రి మృతి చెందాడు. జఫ్పర్ చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య షరీఫా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ



తాండూరు టౌన్: క్యాంపు కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే బీఎంఆర్



అనంతగిరి: మున్సిపల్ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న చైర్‌పర్సన్ మంజుల



అనంతగిరి: ఎస్పీ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు వికారాబాద్ పట్టణం, మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించారు. వికారాబాద్‌లోని జెడ్పీ కార్యాలయంపై కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ కార్యాలయంపై జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి జెండా ఎగురవేశారు. జిల్లా గ్రంథాలయం ఎదుట, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మండల ప్రత్యేకాధికారి సుధీర్, ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆర్‌డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ లక్ష్మీనారాయణ త్రివర్ణ పతాకం ఆవిష్కరించారు. మున్సిపల్, మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు అశోక్‌కుమార్, గ్రామ పంచాయతీల వద్ద ప్రత్యేకాధికారులు జెండాను ఎగురవేశారు.

కాంగ్రెస్ హయాంలోనే ప్రజా పాలన: ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజా పాలన సాగుతోందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆనంద్‌రావు, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సంతోష్ ఆయా శాఖల కార్యాలయాల్లో అధికారులు జెండాను ఎగురవేశారు.



పరిగి: క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



అనంతగిరి: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అడిషనల్ కలెక్టర్ సుధీర్



వినతిపత్రం అందజేస్తున్న రుణమాఫీ బాధిత రైతులు, ప్రజాసంఘాల నాయకులు

రుణమాఫీ డబ్బులివ్వండి

- రైతులతో కలిసి ప్రజాసంఘాల ఆందోళన
- బొంరాస్‌పేట ఎస్‌బీఐ ఎదుట ధర్నా

బొంరాస్‌పేట: రైతులకు అందిస్తున్న రుణమాఫీ డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయకపోతే ఊరుకునేది లేదని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం బాధిత రైతులతో కలిసి స్థానిక ఐస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, అంబేడ్కర్ సంఘాల తాలూకా అధ్యక్షుడు రమేష్ బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుభాష్ మాదిగ మాట్లాడుతూ.. రుణమాఫీ డబ్బులు అందని వారు చాలా మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం ప్రభుత్వమా..? బ్యాంకులా అర్థం కాని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పటికైనా అర్హులందరికీ మాఫీ వర్తింపజేయాలని కోరారు. ఈ మేరకు బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, బీవీఎం జిల్లా అధ్యక్షుడు అరుణ్‌నాయక్, కేఎన్‌పీఎస్ జిల్లా నాయకుడు లక్ష్మయ్య, బలరాం, దప్పు వెంకటయ్య, మాజీ సర్పంచు బాధిత రైతులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గేదెను తప్పించబోయి..

అదుపుతప్పిన బైక్

- గాయపడిన యువకుడు

తాండూరు రూరల్: అడ్డుగా వచ్చిన గేదెను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి ఓ యువకుడు గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని గౌతాపూర్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఆస్పత్రి వర్గాలు తెలిపిన ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంకుర్‌శర్మ జేసీబీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గౌతాపూర్ వద్ద ఆయన బైక్‌కు గేదె అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించేందుకు యత్నించగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన యువకుడిని తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కాగా ప్రమాద విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

‘ఆయిల్ పామ్’కు ప్రోత్సాహం

- పంట సాగు లక్ష్యం.. 30 వేల ఎకరాలు
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి సత్తార్



సత్తార్

తాండూరు రూరల్: ఆయిల్ పామ్ సాగు చేసే రైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్తార్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు లక్ష్యం సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటి వరకు 700 ఎకరాల్లో సాగు నమోదైందని, తాండూరు ప్రాంతంలోని రైతులు ఇందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని స్పష్టంచేశారు. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ సౌకర్యం కలిస్తున్నామని చెప్పారు. 5ఎకరాల పైన ఉన్న రైతులకు 80 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ వర్తిస్తుందని వెల్లడించారు. ఎకరా విస్తీర్ణంలో సుమారు 52 మొక్కలు నాటుకోవచ్చని తెలిపారు. మూడేళ్ల వరకు ఇందులో అంతర పంటలు సాగు చేసుకోవచ్చని వివరించారు. ఎకరాకు 10 నుంచి 16 టన్నులు ఆయిల్ పామ్ దిగుబడి అందుతుందన్నారు.

రూ.13 లక్షలు మంజూరు..

జిల్లాలోని అనంతగిరిపల్లి, చెంచుపల్లిలోని 33 కుటుంబాలకు చెందిన రైతులు 41 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చారన్నారు. రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకు వచ్చిన రైతులు బోరు బావులు తవ్వించుకునేందుకు రూ.13 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెరీకల్చరల్ ఎస్ఓ విజయ్ ఉన్నారు.

పీహెచ్‌సీ, కళాశాలలు దుద్యాల్‌లోనే

- లేదంటే ఉద్యమిస్తాం
- అఖిలపక్ష పార్టీల నాయకుల డిమాండ్
- ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాల అందజేత



కడా అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

దుద్యాల్: పీహెచ్‌సీ, జూనియర్, ఐటీఐ కళాశాలలు హకీంపేట్‌లో ఏర్పాటు చేస్తూ విడుదల చేసిన జీఓను ఉపసంహరించుకోవాలని దుద్యాల్ అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్, కడా అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన దుద్యాల్ మండల అభివృద్ధికి మండల కేంద్రంలోనే ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. జీఓను రద్దు చేయని పక్షంలో ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు బుస్స చంద్రయ్య, నరేశ్, ఆహ్మద్, రాములు, రమేశ్, పాషా, నర్సింలు గౌడ్, బసిరెడ్డి, రాజు, అప్సర్, శాంతు, వెంకటయ్య, రవి నాయక్, గోపాల్ నాయక్, శివప్ప, వెంకటయ్య, అంజిలయ్య, గ్రామ యువత పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

పరిగి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నాయి. ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సేడెం తాలూకా కాణగడ్డ గ్రామానికి చెందిన చాకలి రాజు(38) భార్యా పిల్లలతో కలిసి మొయినాబాద్‌లో మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గుర్మిట్కల్‌లో బైక్ ఫైనాన్స్ కట్టి వస్తానని భార్యకు చెప్పి బయలుదేరాడు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో చింతల్‌చెరువు సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతూ వృద్ధుడు..

రోడ్డు దాడుతుండగా లారీ ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా హైదాబాద్ నుంచి కొడంగల్ వైపు ప్రయాణిస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన లారీ వృద్ధుడిని ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో వృద్ధుడి శరీర భాగం నుజ్జు నుజ్జు అయి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు.

ఉద్యమకారులపై పెట్టిన కేసు కొట్టివేత

తాండూరు: తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసు వీగిపోయింది. పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు అయూబ్ ఖాన్ బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ 2017లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ.. ఉద్యమకారులు వెంకటేశ్‌చారి, భానుప్రసాద్, ఫెరోజ్, ఆరీఫ్, సాధిక్ తదితరులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు ధర్నా నిర్వహించారు. దీంతో అప్పటి ప్రభుత్వం వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసింది. తాండూరుకు చెందిన న్యాయవాది గోపాల్ వీరి తరఫున కేసు వాదించారు. ఏడేళ్ల తర్వాత కేసును కొట్టివేస్తూ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

ఎనిమిదేళ్లుగా నిర్లక్ష్యం

- ప్రభుత్వ కార్యాలయాల్లో నిరుపయోగంగా మారిన జనరేటర్లు
- విద్యుత్ సరఫరా నిలిచిపోతే తప్పని తిప్పలు



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

దౌల్తాబాద్: విద్యుత్ సరఫరా అంతరాయంతో ప్రభుత్వ కార్యాలయాల్లో విధులకు ఆటంకం కలగకుండా ఎనిమిదేళ్ల క్రితం ప్రభుత్వం జనరేటర్లు పంపిణీ చేసింది. ఏళ్లు గడుస్తున్నా వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన జనరేటర్లు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నాయి. దీంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇవి ఏర్పాటు చేసిన కొత్తలో కొన్నాళ్ల పాటు పనిచేసినా ఆ తర్వాత వాడిన దాఖలాలు లేవు. దీంతో విద్యుత్ కోతల సమయంలో కార్యాలయాల్లో అధికారులతో పాటు పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు.

గంటల తరబడి నిరీక్షణ

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు కంప్యూటర్లు, ఫ్యాన్లు ఆగిపోయి అధికారులకు సిబ్బందికి ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. కనీసం ఇన్వర్టర్ల సౌకర్యం కూడా లేకపోవడంతో కార్యాలయాల్లో విద్యుత్ సరఫరా నిలిచినపుడు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు గంటల కొద్దీ నిరీక్షణ తప్పడంలేదు. మండలంలో కీలకంగా ఉండే తహసీల్దారు కార్యాలయంలోనూ జనరేటర్ వినియోగంలో లేదు. ఇన్వర్టర్లు మాత్రమే ఏర్పాటు చేసుకున్నారు. అవి కొంత సమయంవరకు మాత్రమే పనిచేస్తున్నాయి. అలాగే మండల పరిషత్, ఐకేపీ, ఎంఆర్‌సీలలో నిత్యం కంప్యూటర్లు ఆన్‌లైన్‌తోనే ఎక్కువగా పనులు సాగుతుంటాయి. జనరేటర్లు, ఇన్వర్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. కంప్యూటర్లకు యూపీఎస్‌లు ఉన్నప్పటికీ పది నిమిషాలకు మించి పనిచేయవు. నిధుల కొరత కారణంగా వాటిని సమకూర్చుకోలేకపోతున్నామని అధికారులు అంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి కరెంట్ కష్టాలకు చెక్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం

ఇక్కడ కొత్తగా బాధ్యతలు స్వీకరించాను. జనరేటర్ పనిచేయడం లేదని తెలిసింది. దానిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాను. త్వరలోనే ఈ విషయం ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరిస్తాను.

– శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

చోరీ కేసులో వ్యక్తికి జైలు

పరిగి: దొంగతనం కేసులో ఓ వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివారలు 2023 అక్టోబర్ 2న పట్టణ కేంద్రంలోని చంద్రశేఖర్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ చోరీలో 6.3 తులాల బంగారు ఆభరణాలు, రూ.3లక్షలు దోపిడీకి పాల్పడ్డారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నర్సారావుపేటకు చెందిన దాసరి విజయ్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశ పెట్టారు. జడ్జి నాగుల శిల్ప కేసు పూర్వపరాలు పరిశీలించి నిందితుడికి ఎనిమిది నెలల నాలుగు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చిందని పోలీసులు తెలిపారు.

గ్రామస్తుల సహకారం అభినందనీయం



మానిటరింగ్ గదిని ప్రారంభిస్తున్న ఎస్ఐ శంకర్

యాలాల: సీసీ కెమెరాల ఏర్పాటులో గ్రామస్తుల సహకారం అభినందనీయమని యాలాల ఎస్ఐ శంకర్ అన్నారు. ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కమాల్‌పూర్‌లో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో నిఘా నేత్రాల పాత్ర కీలకమన్నారు. గ్రామస్తులు ఎనిమిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎస్ఐను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువనాయకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బస్వరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



కొడంగల్ రూరల్: పూజలకు హాజరైన విశ్వకర్మ సంఘం సభ్యులు

కొడంగల్ రూరల్: శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మహాదేవుని ఆలయ ఆవరణలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను చేపట్టారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘం సభ్యులు మాట్లాడుతూ.. విశ్వకర్మ భగవానుడి లీలలు నేడు కాలాల్లో వస్తున్న మార్పులే అన్నారు. సంఘం అభివృద్ధికి సంఘటితంగా కృషి చేయాలన్నారు.

తాండూరు విశ్వకర్మసంఘం ఆధ్వర్యంలో..

తాండూరు: తాండూరు విశ్వకర్మసంఘం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ శివారులోని శ్రీ విరాట్ విశ్వకర్మ వేద భూమిలో జయంతి ఉత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, పెద్దేముల్ మాజీ వైస్ ఎంపీపీ మధులత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం సభ్యులు శ్రీనివాసచారి, పులిందర్‌చారి, పాండు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న వ్యక్తి అరెస్ట్

కద్లాల్: గంజాయి తాగుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన మండల పరిధిలోని ముద్వీన్‌లో చోటు చేసుకుంది. సీఐ శివప్రసాద్ మంగళవారం తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్బాస్ అనే యువకుడు పెయింటర్‌గా పనిచేస్తూ, అప్పుడప్పుడు హైదరాబాద్ నగరంలోని దూల్‌పేట్ ప్రాంతంలో గంజాయి ని కొనుగోలు చేసి, తన మిత్రుడైన ఆమనగల్లుకు చెందిన పవన్‌తో కలిసి తాగేవారు. ఇత రులకు కూడా ఇచ్చేవారు. ఈనెల 16న స్థానిక పాఠశాల సమీపంలో అబ్బాస్ గంజాయి తాగుతున్నాడని సమాచారం అందుకున్న ఎస్ఐ వరప్రసాద్ సిబ్బందితో కలిసి ముద్వీన్‌కు చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఇతని వద్ద లభించిన 27 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, పీఎస్‌కు తరలించారు. మరో యువకుడు పవన్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ వరప్రసాద్, కానిస్టేబుళ్లు, రామ్‌కోటి, రాజశేఖర్, శ్యాంసన్‌ను సీఐ అభినందించారు.